# సంపాదకీయము

పూజ్య గురుదేవులు శ్రీ బాబూజీ మహారాజ్ వారి 110 వ జన్మదినోత్సవ సందర్భములో వారి స్మరణలో ఈ పవిత్రమైన దినములను గడుపు సత్‌సంకల్పముతో మనందరము సమావేశమైనాము.

ఈ రోజులలో చాలామంది దృష్టిలో జీవితము అర్థము లేనిదిగా భావించుచుండెదరు. సుఖవంతమైన జీవితము కలవారు కూడా ఒకదశలో దానిపై తృణీకరణ భావము, అసంతృప్తులతో వికల మనస్కులై యుండు సందర్భములను తరచుగా గమనించవచ్చును. వారి దృష్టిలో జీవితము నిరర్థకము. ఆవిధమైన భావనలు కలిగి యుండుట ఆత్మహత్యతో సమానమైనది. ఈ జీవితములోనికి వొకశక్తితో వచ్చినామని గ్రహించకపోవుటయే దీనికి కారణము. ఆ శక్తిని అభివృద్ధిపరచుకొని దానితో సహజీవనము చేయు అభిలాష కలిగినప్పుడు ప్రస్తుతము మనము సాగించు జీవితము జీవితము కాదని గ్రహింపుకు వచ్చి జీవితములోని విలువను గుర్తించి మన గమ్యమైన దివ్యత్వమును గుర్తుచేయును. మన గమ్యము దివ్యత్వమైనప్పుడు దైవము లేదు అను భావన కూడదు.

అందరము మన లక్ష్యమైన దివ్యత్వము వైపునకు పయనించుచున్నాము. అనంతమైన ఆ దివ్యత్వమువైపు మన పయనము ఎరుకతో కొనసాగించినపుడు, ప్రశాంతమైన జలములలో ఈదుకొని ముందుకు పోవుచున్నటుల, సుఖవంతముగా సాగిపోవును. కాని ప్రాపంచిక విషయములలో సతమతమగుచు మనలోని దివ్యశక్తిని గుర్తించక అలక్ష్యము చేసి, దాని ఎరుక లేకుండా జీవితము కొనసాగించు చుండెదము. అటువంటి నిద్రాణస్థితిలోనున్న మనలో సరిక్రొత్త జీవనము ప్రసాదించుటకు ప్రాణాహుతి సత్ఫలితముల నొసంగును. సాధకునికి, దైవమునకు నడుమ గురువు అనుబంధము కలుగజేయుచు ప్రాణాహుతి సహాయముతో ఆధ్యాత్మిక మార్గమునందు పురోగతిలోని ప్రతిబంధకములను తొలగించుచూ మనలో పరివర్తన తీసుకొనివచ్చును. మన సంస్థ ఆది గురువులైన పూజ్య లాలాజీ మహారాజ్ వారు ప్రాణాహుతి మూలము అంతరించిపోవుచున్నప్పుడు దానికి శక్తిని ప్రసాదించి మానవాళికి వారి ఆధ్యాత్మిక సాధనలో త్వరితగతిని గమ్యము చేరుటకు కడుతోడ్పాటునందించు అవకాశము కల్పించినారు. మరుగునపడిపోవుచున్న ఆధ్యాత్మిక జీవన విధానమును తిరిగి నెలకొల్పు స్థిరసంకల్పముతో మన గురుదేవులైన పూజ్య బాబూజీ మహారాజ్ వారు ఈ పద్ధతిని అందరికీ అందుబాటులోనికి తెచ్చినారు. ఈ విధానము సరియైనదని ప్రజలకు అవగాహన కలిగినప్పుడు తమంతట తామే దీనివైపు ఆకర్షింపబడెదరు. దీనికి మనమందరము ప్రేమ, ఓర్పు మరియు పరస్పర

సహకారముతో కృషిచేసిన గురుదేవుల సంకల్పము తప్పక నెరవేరును. సాధకులుగా యితరులకు ఆధ్యాత్మికముగా మేలుచేయుట మనందరి కర్తవ్యముగా గుర్తించి వారు ప్రసాదించిన సత్యపథమార్గములో సాధన చేయుచూ లక్ష్యమువైపు సాగిపోవుటకు వారి కృపాకటాక్షములు అందరికీ లభించునని విశ్వసించుచున్నాము.

- వి. రామం

* * *

"దివ్యకృపయెడల మనమెన్నడు ఆశాభంగం చెందరాదు. దైవమే సర్వోత్కృష్ట ప్రభువు, ప్రతి విషయంలో ఆయన సంకల్పం నెరవేరవలసిందే. మన సర్వాన్ని పోగొట్టుకున్న వారుగా యుండి మన మార్గంలో సంభవించే ఆటంకాలను, అలజడులను లెక్కచేయక భక్తి, ఆరాధనలతో సదా నిమగ్న మై యుండాలి." (Silence Speaks, page 313)

-

**- పూజ్య బాబూజీ మహారాజ్**